సాక్షి
ఏలూరు
మంగళవారం । 15 । ఆగస్టు । 2023



ఎస్ఈబీ దాడులు

చింతలపూడి: నాగిరెడ్డిగూడెం, నామవరంలో దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ ఇన్స్పెక్టర్ సాయి స్వరూప్ తెలిపారు.



శివయ్యకు రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు.



విశేష అలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం మావుళ్లమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ఎస్.కార్తికేయశర్మ గజమాల సమర్పించారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి.. గ్రామ స్వరాజ్య దీప్తి

బాపూజీ కలలను సాకారం చేస్తున్న సీఎం జగన్

బాపూజీ కలలగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతోంది. ప్రజల వద్దకే పాలన చేరువయ్యింది. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్‌ల ఆశయ సాధనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు–నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకుంటున్నాయి.

- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు పాలన చేరువ
- విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ఇంటింటా సంక్షేమ కాంతులు

ఏలూరు(మెట్రో): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. విద్య, వైద్యం, మహిళా సాధికారత, వ్యవసాయం, పేదలకు ఇళ్లు ఇలా అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేస్తున్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. అలాగే గ్రామాల అభివృద్ధికి పటిష్ట కార్యాచరణతో పనులు చేపడుతున్నారు.

ముంగిళ్లలోకే పథకాలు

సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను పేదల ఇళ్లకే చేరుస్తున్నారు. జనన ధ్రువీకరణ పత్రం నుంచి మరణ ధ్రువీకరణపత్రం వరకు ఇంటి పన్ను, కుళాయి పన్ను ఇలా ప్రతిఒక్క సేవను ప్రజలకు చేరువ చేశారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 605 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సేవా వలంటీర్లు

వలంటీర్ వ్యవస్థ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర వర్గాలకు ఒకటో తేదీన వేకువజామునే పింఛన్ అందిస్తున్నారు. అలాగే వాహనాల ద్వారా కార్డుదారులు ఇంటి ముంగిటే రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 10,681 మంది వలంటీర్లు సేవలందిస్తున్నారు.

వ్యవసాయం పండుగ

వ్యవసాయాన్ని పండుగ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లావ్యాప్తంగా 520 రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు సేవలు అందిస్తోంది. ఈ–క్రాప్, రైతులకు రుణాలు, ఎరువులు, పురుగు మందులు, పంట నష్టపరిహారాలు ఇలా ప్రతిఒక్కటీ రైతు భరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అందుతున్నాయి.

పల్లె ముంగిట ప్రభుత్వ వైద్యం

ఆరోగ్యశ్రీ, 104, 108 సేవలతో పాటు పేదల ఇంటికే వైద్యులు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసేలా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని అమలు చేస్తున్నారు. అలాగే పల్లెల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటుచేసి స్థానికంగానే వైద్యం అందిస్తున్నారు.



పొణంగి సచివాలయం



చొదిమెళ్ల రైతు భరోసా కేంద్రం



విలేజ్ క్లినిక్

ప్రగతికి కట్టు'బడి'

విద్యారంగం అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్న సీఎం జగన్ ప్రభుత్వ బడులకు మహర్దశ పట్టిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అటువైపు కన్నెత్తి చూడని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను సమూలంగా మార్చివేస్తున్నారు. మన బడి నాడు–నేడు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తూ కార్పొరేట్‌ను మించిన సౌకర్యాలతో ప్రభుత్వ బడులను రాజమహళ్లుగా మారుస్తున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో తొలి విడతగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 648 పాఠశాలలను ఎంపిక చేసి రూ.134. 84 కోట్లతో అభివృద్ధి చేశారు. రెండో విడత కార్యక్రమం కింద పనులను ప్రారంభించారు. ఈ మేరకు జిల్లాలోని 883 పాఠశాలలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి రూ.293.78 కోట్ల నిధులను మంజూరు చేశారు. మంజూరు చేసిన నిధుల్లో ఇప్పటికే రూ.95.62 కోట్ల నిధులను విడుదల చేయగా దానిలో 87.03 శాతం నిధులను వినియోగించి రూ.83.22 కోట్లతో కొన్ని పాఠశాలల సుందరీకరణ, సౌకర్యీకరణ పనులు దాదాపు 90 శాతానికి పైగా పూర్తికావచ్చాయి.

న్యూస్‌రీల్

స్పందనలో 473 అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 473 అర్జీలు స్వీకరించినట్టు చెప్పారు. జిల్లాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 77వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి శాఖాధికారులు, సిబ్బందితో జెండా ఆవిష్కరణ చేయాలని సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను రీ ఓపెనింగ్ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పరిష్కరించి అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. జిల్లా ఆడిట్ అధికారులు అర్జీల పరిశీలనలో ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్‌ఓ ఏవీఎస్ఎస్ మూర్తి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జెడ్పీ సీఈఓ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, ఆర్డీఓ కె.పెంచల కిషోర్, వ్యవసాయశాఖ జేడీ రామకృష్ణ అర్జీల స్వీకరణలో పాల్గొన్నారు.

పటిష్టంగా ఫ్యామిలీ ఫిజీషియన్

ఏలూరు(మెట్రో): ఫ్యామిలీ ఫిజీషియన్ విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం వైద్య సేవలు, వ్యవసాయం, సర్వే తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని, నాడు–నేడు కార్యాక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంపై ప్రతివారం సమీక్షిస్తామన్నారు. మాతా, శిశు మరణాల నివారణలో భాగంగా ప్రసవాలన్నీ ఆస్పత్రుల్లో జరగాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఈ–క్రాప్, ఈ–కేవైసీ పనులు గడువులోపు పూర్తిచేయాలన్నారు. కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలను రెండు రోజుల్లోగా అందించాలన్నారు. జగనన్న భూహక్కు,–భూ సర్వే కింద జిల్లాలో రెండోవిడతలో చేపట్టిన సర్వే వేగిరపర్చాలని ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



సాక్షి, భీమవరం : రాష్ట్ర ప్రజలకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న శుభసందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

కవి ప్రసాద్‌కు జాతీయస్థాయి పురస్కారం

తణుకు: అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం పోటీల్లో తణుకుకి చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్ ప్రతిభ చూపారు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 410 మంది కవులు పాల్గొనగా వీరిలో 20 మందిని ఎంపిక చేశారు. సత్యసాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ చేతులమీదుగా ప్రసాద్ ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. నిర్వాహకులు వడ్డి సుధాకర్, అధ్యక్షురాలు చిట్టే లత, డి.నరేష్, గెడిదం అశోక్ తదితరులు ప్రసాద్‌ను అభినందించారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం రూరల్ : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 1.03 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం



ముస్తాబైన కలెక్టరేట్

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవాలకు సర్వం సిద్ధమైంది. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఆర్డీఓ కె.పెంచల కిషోర్ పరిశీలించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ హాజరు కానున్నారని తెలిపారు. మంగళవారం ఉదయం 8.45 గంటలకు ముఖ్య అతిథి ఆగమనం, 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 9.05 గంటలకు పోలీస్ గౌరవ వందన స్వీకరణ, పరేడ్ గ్రౌండ్ సందర్శన, 9.15 గంటలకు ముఖ్య అతిథి సందేశం, 9.30 గంటలకు పోలీస్ కవాతు, 10 గంటలకు ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20 గంటలకు స్టాల్స్ సందర్శన, 10.40 గంటలకు విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు, 11.15 గంటల నుంచి ప్రశంసా పత్రాల ప్రదానం, 11.45 గంటలకు జాతీయ గీతాలాపన ఉంటుందని ఆర్డీఓ వివరించారు.

నావెల్ బేస్ ఏర్పాటుకు సన్నాహాలు

ఎంపీ కోటగిరి శ్రీధర్



శ్రీనివాసపురం సర్పంచ్ యడ్లపల్లి రాధికను అభినందిస్తున్న ఎంపీ శ్రీధర్

జంగారెడ్డిగూడెం: జీలుగుమిల్లి మండలంలో నావెల్ బేస్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఫెన్స్ శాఖ వైజాగ్‌కు సంబంధించిన నావెల్‌బేస్ సరిపోవడం లేదని, బ్యాకప్‌గా మరో బేస్ తయారు చేసుకోవాలనే ఉద్దేశంలో ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి నావెల్ బృందాన్ని ఆహ్వానించి పరిశీలన చేయించామన్నారు. నావెల్ అధికారులు రెండు సార్లు ఇక్కడ పర్యటించి మన ప్రాంతాన్ని ఎంపిక చేశారన్నారు. త్వరలో నావెల్‌బేస్ ఇక్కడ ఏర్పాటు చేస్తారని, ప్రస్తుతం పేపర్ వర్క్ జరుగుతుందని చెప్పారు. ఇది భారీ ప్రాజెక్టు అని, దీనికి 1,300 ఎకరాలు అవసరం ఉందన్నారు. బేస్ ఏర్పడితే 1,000 మంది అధికారులు ఇక్కడ శాశ్వతంగా పనిచేస్తారన్నారు. నావెల్ శిక్షణ, కార్యకలాపాలు జరుగుతాయన్నారు. స్థిరకాలపు మంచి ప్రాజెక్టు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా ముంపు గ్రామాల బాధితులకు మంచి అవకాశం అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కలిగించిందని, మహాత్ముల కలలను నిజం చేస్తున్నామన్నారు. నాలుగేళ్ల పాలనలో పేదరికాన్ని తగ్గించగలిగామని అన్నారు. ఆయన్ను శ్రీనివాసపురం సర్పంచ్‌గా ఏకగ్రీవమైన యడ్లపల్లి రాధిక మర్యాదపూర్వకంగా కలిశారు.

సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కలిగించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో నగదురహిత లావాదేవీల వాల్‌పోస్టర్లను కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై సచివాలయాల్లో నగదు రహిత లావాదేవీలు జరుగుతాయని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన లావాదేవీలను క్యూఆర్ స్కానర్ ద్వారా పూర్తిచేసినట్టు చెప్పారు. దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, జెడ్పీ సీఈఓ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, ఎల్‌డీఎం నీలాద్రి పాల్గొన్నారు.

సింగులూరికి ఇండియన్ పోలీస్ మెడల్



సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఎస్పీ, ఉమ్మడి పశ్చిమ

ఏలూరు టౌన్: అత్యుత్తమ సేవలందించిన విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దిన వేడుకలను పురస్కరించు కుని ఉత్తమ సేవలందించిన పోలీస్ సిబ్బందిని ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేయగా విజిలెన్స్ డీఎస్పీకి స్థానం దక్కటం విశేషం. 2020లో ఆయన డీఎస్పీగా పదోన్నతి పొందగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏసీబీ డీఎస్పీగా పనిచేశారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ శాఖకు డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్వగ్రామం ఆకివీడు మండలం అజ్జమూరు కాగా తండ్రి అంజియ్య, తల్లి సీతారత్నం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వెంకటేశ్వరరావు చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి కనబర్చారు. 1991 బ్యాచ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. అనంతరం కృష్ణా జిల్లా వత్సావాయి, మండవల్లి, పెడన, కలిదిండి తదితర స్టేషన్లలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. 2008లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్వరరావు కాకినాడ ట్రాఫిక్, రాజమహేంద్రవరంలో విజిలెన్స్‌లో పనిచేశారు. ఏసీబీ, విజిలెన్స్‌లో పనిచేస్తూ వృత్తిపై నిబద్ధత, అవినీతి, అక్రమార్కులపై దాడులు చేయటంలోనూ తనదైన ముద్ర వేసుకున్నారు. మెడల్‌కు ఎంపిక కావటం అదృష్టంగా భావిస్తున్నాననీ, ఇలాంటి గౌరవం దక్కటం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. తన బాధ్యత మరింత పెరిగిందనీ, సమర్థవంతంగా పనిచేస్తూ ప్రభుత్వానికి మరింత పేరు తీసుకువస్తానని ఆయన చెప్పారు.

కలెక్టర్ శుభాకాంక్షలు

ఏలూరు(మెట్రో): 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా ప్రజలకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.

మధ్యాదాయ వర్గాలకు సువర్ణావకాశం

ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

- నూజివీడులో 40 ఎకరాల్లో 393 ప్లాట్లు
- గజం రూ.8,500కే విక్రయం
- పక్కాగా మౌలిక వసతుల కల్పన
- మామిడి పరిశోధన కేంద్రం పక్కనే లేఅవుట్



నూజివీడులో ఎంఐజీ జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్న 40 ఎకరాల స్థలం



స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ ప్లాన్

నూజివీడు: మధ్యాదాయ వర్గాల వారికి తక్కువ ధరకే ఇళ్ల స్థలాలను అందించేందుకే ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో నూజివీడు పట్టణ పరిధిలోని విస్సన్నపేట రోడ్డులో మామిడి పరిశోధన స్థానం, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల పక్కనే ఉన్న 40 ఎకరాల్లో సీఆర్‌డీఏ పర్యవేక్షణలో స్మార్ట్ టౌన్‌షిప్‌ను సిద్ధం చేస్తోంది. ఎమ్మెల్యే ప్రతాప్ నిరంతరం అధికారులతో చర్చలు జరుపుతూ స్మార్ట్ టౌన్‌షిప్‌నకు అవసరమైన స్థలాన్ని సీఆర్‌డీఏకు అందించడంలో తన వంతు కృషి చేశారు. ఏడాదికి రూ.18 లక్షల లోపు ఆదాయం ఉన్న వారు ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఏలూరు జిల్లాలోనే ఇది అతిపెద్ద స్మార్ట్ టౌన్‌షిప్ లేఅవుట్ కావడం గమనార్హం. మచిలీపట్నం–నూజివీడు–కల్లూరు రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌ను ప్రభుత్వం అన్ని రకాలుగా అభివృద్ధి చేయనుంది.

తక్కువ ధరకు..

సీఆర్‌డీఏ చేపట్టిన ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో గజం ధర రూ.8,500గా ప్రభుత్వం నిర్ణయించింది. సీఆర్‌డీఏకు సంబంధించిన వెబ్‌సైట్‌లో స్థలం కావాల్సిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 150, 200, 240 గజాల వైశాల్యంతో కూడిన ప్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ లేఅవుట్‌లో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైపులైన్‌ల ఏర్పాటు, రిజర్వు స్థలాలు, అందమైన పార్కుల అభివృద్ధి, విద్యుత్, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. లేఅవుట్‌కు ఏపీసీఆర్‌డీఏ, ఏపీ రెరా అనుమతులు సైతం ఉన్నాయి.

టౌన్‌షిప్‌లో ప్లాట్లు

ప్లాట్ విస్తీర్ణం (గజాలు)	ప్లాట్ల సంఖ్య	నికర విలువ (రూ.లక్షలు)
240	153	20.40
200	121	17.00
150	119	12.75

సులభతర వాయిదా పద్ధతుల్లో..

ఎంఐజీ ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలకు ప్రభుత్వం సులభతర వాయిదా పద్ధతులను అందుబాటులోకి తీసుకువచ్చింది. నికర అమ్మకం ధరలో 10 శాతం మొత్తాన్ని చెల్లించి ప్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. అన్ని ప్లాట్లు బుక్ అయిన తర్వాత లాటరీ విధానంలో కేటాయిస్తారు. ప్లాట్ కేటాయింపు జరిగిన తర్వాత నెల రోజులలోపు లబ్ధిదారులు అగ్రిమెంట్ చేసుకోవాలి. అగ్రిమెంట్ చేసుకొన్న నెల లోపు నికర అమ్మకం ధరలో 30 శాతం చెల్లించాలి. ఆ తర్వాత 180 రోజుల్లో మరో 30 శాతం, ఏడాదిలోపులో మిగిలిన 30 శాతాన్ని చెల్లించాల్సి ఉంటుంది. నికర మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీని సైతం ఇస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్‌లను కేటాయించడంతో పాటు 20 శాతం రిబేట్‌ను అందిస్తోంది.

రూ.27 కోట్లతో మౌలిక వసతుల కల్పన

నూజివీడులోని ఎంఐజీ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.27 కోట్లు కేటాయించింది. 60, 80 అడుగుల వెడల్పుతో ప్రధాన తారురోడ్లు, 40 అడుగుల వెడల్పుతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మిస్తారు. ప్రత్యేక మంచినీటి ట్యాంక్‌లు నిర్మించి మంచినీటి వ్యవస్థను ఏర్పాటుచేస్తారు. అలాగే మురుగునీటి శుద్ధి ప్లాంట్, జనాభాకు అనుగుణంగా విద్యుత్ వినియోగ అవసరాలకు తగ్గట్టు అత్యధిక సామర్థ్యం గల సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటుచేస్తారు. ఆహ్లాదాన్నిచ్చే పార్కులను ఈ స్మార్ట్ టౌన్‌షిప్‌లో అభివృద్ధి చేయనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు మధ్యతరగతి ప్రజలకు మంచి అవకాశం. దీనిని వారు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వమే మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. తారురోడ్డులు, సిమెంట్ రోడ్లు, మంచినీరు, ఆహ్లాదకరమైన పార్కులు తదితర అన్నిరకాల సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. అన్నిరకాల అనుమతులు కూడా టౌన్‌షిప్‌నకు ఉన్నాయి.

–షేక్ అలీంబాషా, అడిషనల్ కమిషనర్, సీఆర్‌డీఏ, అమరావతి

క్లుప్తంగా

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన



ట్యాంక్ ఎక్కి నిరసన

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో సుమారు 2 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఆ భూమిని కొంతమంది ఆక్రమించుకుని వ్యవసాయం చేయకుండా అడ్డుకుంటున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి నారాయణమ్మ, ఆమె కుమారుడు నిరసన వ్యక్తం చేశారు. పురుగుల మందు డబ్బా పట్టుకుని ట్యాంక్ ఎక్కి ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సుందర్ సింగ్, ఎస్సై చంద్రశేఖర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పారు. ఆ భూములకు రక్షణ కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వచ్చే నెలలో ఫిషరీస్ తరగతులు

- రాష్ట్రంలోనే నర్సాపురంలో మొదటి ఆక్వా యూనివర్సిటీ
- నిపుణుల కొరత అధిగమించేందుకు వర్సిటీ ఏర్పాటు
- 60 సీట్లతో ఈ ఏడాది నుంచి కళాశాల ప్రారంభం



ఫిషరీస్ యూనివర్సిటీ నమూనా భవనం

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఆక్వా రంగంలో నిపుణుల కొరతను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలిసారి ఆక్వా హబ్‌గా వెలుగొందుతున్న నర్సాపురంలో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ. 330 కోట్లతో 40 ఎకరాల విస్తీర్ణంలో వర్సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసి పనులు నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. నర్సాపురం మండలంలోని లక్ష్మణేశ్వరంలోని ప్రభుత్వ భవనంలో ఆంధ్రా మత్స్య విశ్వవిద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేయడంతో పాటు 60 గ్రాడ్యుయేషన్ సీట్లతో వచ్చే నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

డాలర్ల వర్షం కురిపించే ఆక్వాకు సాంకేతికత, నిపుణుల కొరత వెంటాడుతుంది. నిష్ణాతులైన గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఈ రంగంలో లేకపోవడంతో పుష్కలంగా అవకాశాలున్నా, స్థానిక యువత అందిపుచ్చుకోలేని పరిస్థితి. దీన్ని అధిగమించడానికి గతేడాది నవంబరులో మత్స్య విశ్వవిద్యాలయాన్ని నర్సాపురంలోని సరిపల్లి–లిఖితపూడి గ్రామాల మధ్య ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దేశంలోనే మూడో మత్స్య విశ్వవిద్యాలయంగా, రాష్ట్రంలో మొదటిదిగా నిలిచింది. 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.330 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి మొదటి దశ పనులకు రూ.100 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పరిపాలనా భవనాల నిర్మాణం పూర్తయితే అక్కడ వర్సిటీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.



వేగంగా సాగుతున్న యూనివర్సిటీ భవనం పనులు



తాత్కాలిక యూనివర్సిటీ భవనం

లక్ష్మణేశ్వరంలో తాత్కాలికంగా వర్సిటీ

యూనివర్శిటీ కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రత్యేకాధికారిగా ప్రొఫెసర్ ఓగిరాల సుధాకర్‌ను నియమించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19న లక్ష్మణేశ్వరంలోని ప్రభుత్వ భవనంలో యూనివర్శిటీ, మత్స్యకళాశాల రెండు ప్రారంభమయ్యాయి. మొదటి ఏడాది 60 బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) సీట్లతో ఈ ఏడాది సెప్టెంబర్ రెండో వారం నుంచి కళాశాల ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రభుత్వం 140 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసింది. నర్సాపురం కళాశాలకు 75 పోస్టులు, యూనివర్శిటీ హెడ్ ఆఫీస్‌కు 60 పోస్టులు కేటాయించారు. డీన్, అసోసియేట్ డీన్ కాకుండా మరో 12 మంది టీచింగ్ స్టాఫ్, 10 నాన్ టీచింగ్ స్టాఫ్‌తో కళాశాల ప్రారంభమైంది.

సెప్టెంబర్ రెండోవారం నుంచి తరగతులు

బీఎఫ్ఎస్సీ కోర్సులో చేరడానికి ఎంసెట్ కౌన్సెలింగ్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం వెబ్‌ఆప్షన్లు పూర్తయితే ఎడిటింగ్ ఆప్షన్ ఇచ్చారు. ఈ నెలాఖరు నాటికి కౌన్సిలింగ్ ప్రక్రియలో సీట్లు కేటాయించి సెప్టెంబర్ రెండో వారం నుంచి నాలుగేళ్ల బీఎఫ్ఎస్సీ గ్రాడ్యుయేషన్ కోర్సు ప్రారంభించనున్నారు. నాలుగేళ్ళ కోర్సులో 8 సెమిస్టర్లు ఉంటాయి. 6 సెమిస్టర్లలో కోర్సు పూర్తి చేస్తే చివరి రెండు సెమిస్టర్లల్లో ఫీల్డ్ విజిట్లు, స్టడీ టూర్లు, ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ ఉంటాయి. కోర్సు పూర్తయిన వారికి నూరు శాతం ఉపాధి అవకాశాలున్నాయి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హులవుతారు. వివిధ బ్యాంకుల్లో స్పెషలాఫీసర్, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డులో పోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాడిష్ వాటర్ ఆక్వా కల్చర్ తదితర ప్రభుత్వ సంబంధ శాఖల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

వచ్చే ఏడాది నుంచి మాస్టర్ కోర్సులు ప్రారంభిస్తాం



నరసాపురంలో పిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ఈ విద్యాసంవత్సరంలో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్ కోర్సులో 60 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మాస్టర్ ఆఫ్ ఫిషరీష్ అండ్ సైన్స్ అలాగే పీహెచ్‌డీ కోర్సులు ప్రారంభమవుతాయి. అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ ప్రక్రియ కూడా జరుగుతుంది. వచ్చే ఏడాది సొంత భవనంలో తరగతులు నడుస్తాయి.

ప్రొఫెసర్ ఓగిరాల సుధాకర్, యూనివర్సిటీ ప్రత్యేక అధికారి

మత్స్య ఉత్పత్తులు పెరుగుతాయి



ఆక్వా రంగానికి ప్రభుత్వం నుంచి ఇలాంటి ప్రోత్సాహం చాలా అవసరం. ఆక్వా రంగ నిపుణుల్ని తయారు చేసుకుని, సాగులో నైపుణ్యాలు పెంచుకుంటే ఆక్వా సాగులో నష్టాలు తగ్గుతాయి. ప్రభుత్వం జిల్లాలో ఆక్వా, మత్స్య రంగాలను ఎలా అభివృద్ధి చేయాలని పరితపిస్తోంది. ఇందులో భాగంగానే దేశంలో మూడవదిగా, రాష్ట్రంలో మొదటిగా అంతర్జాతీయ ఫిషరీష్ యూనివర్సిటీ నరసాపురంలో ఏర్పాటైంది.

ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

విద్యుత్ బిల్లులు చెల్లించాలని వచ్చే మెసేజ్‌లు నమ్మొద్దు

ఉండి: విద్యుత్ బిల్లులు చెల్లించాలంటూ కొందరు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింక్‌లు నమ్మి మోసపోవడద్దని భీమవరం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఉండి మండలం పెదపుల్లేరులో జరిగిన ఓ సైబర్ మోసాన్ని ఉదహరించారు. కరెంట్ బిల్లులు చెల్లించాలని.. లేదంటే కరెంట్ కట్ చేస్తామంటూ వచ్చే మెసేజ్‌లు, ఆన్‌లైన లింకుల్ని నమ్మొద్దన్నారు. వారు పంపించే ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి మోసపోవద్దని తెలిపారు. వినియోగదారులు ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో గాని ఫోన్‌పే, గూగూల్ పే, పేటీయం, మీసేవా ద్వారా గాని లేదా కరెంట్ ఆఫీసు వద్ద ఉండే ఈఆర్‌ఓ కౌంటర్‌లో బిల్లులు చెల్లించాలన్నారు. కరెంట్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ శాఖ ఎలాంటి ఆన్‌లైన్ లింక్‌లను పంపించదని ఫోన్ చేయమని కోరదని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల వినియోగదారులు జాగ్రత్త వహించాలని సూచించారు.

రావి ఆకులో మహాత్మా గాంధీ



రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతిని చెక్కిన విద్యార్థులు

కామవరపుకోట: మండలం లో రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రావి ఆకులో మహాత్మా గాంధీ ఆకృతిని చెక్కి ఔరా అనిపించారు. స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు రావి ఆకులో మహాత్మా గాంధీ, నెమలి, పులి, నెహ్రూ, అంబేద్కర్, బడికి పోదాం, బాలికను కాపాడుదాం ఇలాంటి అనేక కళాకృతులను చెక్కి తమ ప్రతిభను చాటుతున్నారు. ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ప్రోత్సాహంతో తెలుగు ఉపాధ్యాయులు బిరుదుగడ్డ నాగేశ్వరరావు లీఫ్ ఆర్ట్‌పై శిక్షణ ఇస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు.

కదం తొక్కిన కైకలూరు

స్వాతంత్య్ర సంగ్రామంలో నడిరోడ్డుపై విదేశీ వస్త్రాల దహనం



కైకలూరు స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్మారక చిహ్నం

కైకలూరు: దేశం 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. భరతమాతను దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయడానికి ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారు. ఆనాటి స్వాతంత్య్ర సమరవీరుల త్యాగాలు కైకలూరు తాలూకాలో నేటికి చిరస్మరణీయంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎందరో మహానుభావులు బ్రిటీష్ ఫిరంగులకు ఎదురొడ్డి పోరాడారు. జాతిపిత మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపు మేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో విదేశీ వస్త్రాలను తగలబెట్టారు. రైతులు, వ్యాపారులు, మహిళలు ఇలా ఎందరో ఆనాడు బానిస సంకెళ్ల నుంచి భారతావనిని కాపాడడానికి ఆందోళనలు చేసి జైలుశిక్షలు అనుభవించారు. పూర్వం కైకలూరు తాలూకాగా ఉండేది. ఇక్కడి నుంచి బ్రిటీష్‌వారు కార్యక్రమాలు కొనసాగించేవారు. అందుకే రెవెన్యూ కార్యాలయం, పాత పోలీసు స్టేషన్, సబ్‌ట్రెజరీ, సబ్ జైలు, పాత ఆస్పత్రిని బ్రిటీష్‌వారు ఒకే వరుసలో నిర్మించారు. అప్పట్లో స్వాతంత్య్రోద్యమ పోరాటంలో ఆందోళనలు చేసిన వారిని అరెస్టు చేసి కైకలూరు జైలుకు తరలించేవారు. ఆ కట్టడాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం విశేషం.

స్వాతంత్య్ర పోరాటాల్లో కై కలూరు తాలూకా యోధులు ఎక్కువగా పాల్గొన్నారు. స్వాతంత్య్రం సిద్ధించి 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా అప్పట్లో కైకలూరు ఎంపీయూపీ పాఠశాల వద్ద సమర వీరులను స్మరిస్తూ ఓ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. కైకలూరు పంచాయతీ తాలూకా పరిధికి చెందిన ఘంట పేరయ్య, కంతేటి కాశీ విశ్వనాథం, మాగంటి నాయుడమ్మ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మాగంటి సత్యనారాయణ, రుద్రరాజు సత్యనారాయణరాజు, చిర్రవూరి అచ్చుతరామయ్య, పొన్నాడు శ్రీరామచంద్రుడు, మేక తిరుపయ్య, గుంటూరు రామదాసు, ఉన్నూరి నరసింహారాజు స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొని తమ పోరాట పటిమ చూపారు.

నా భూమి – నా దేశం

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోడానికి జాతీయ స్థాయిలో నా భూమి – నా దేశంకార్యక్రమాలు గ్రామీణ స్థాయిలో ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా గ్రామాల్లో స్వాతంత్య్ర పోరాటం పాల్గొన్న సమరయోధుల పేర్లను లిఖిస్తున్నారు. శిలాఫకాల ఏర్పాటు, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ జెండా ఎగురవేడయం, మట్టిని సేకరించడం వంటి కార్యక్రమాలు చేస్తూ జాతీయ స్ఫూర్తిని నింపుతున్నారు.

దేశం కోసం మా నాన్న పనిచేశారు



దేశ రక్షణలో సైనికుడిగా నా తండ్రి బ్రహ్మయ్య పనిచేయడం గర్వంగా ఉంది. సైన్యంలో 22 సంవత్సరాలు ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. దేశంపై ప్రేమ, నీతి, నిజాయతీ మాకు బోధించారు. నేడు మనం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నాం, ఈ ప్రాంతంలో ఎందరో సమరవీరులు బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి పోరాడారు. అందరికి వందనం. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి.

– జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్సీ, కైకలూరు.

మరణించేవరకు జాతీయ జెండాను వదల్లేదు



మా తండ్రి ఉప్పాల కోదండరామయ్య 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జైలు శిక్ష అనుభవించారు. ఆచార్య ఎన్‌జీ రంగా ప్రియశిష్యులు. మా తండ్రి 100 సంవత్సరాలకు పైగా జీవించారు. మరణించేవరకు జాతీయ జెండాను వదలలేదు. ఆయన స్వాతంత్య్రోద్య ఘట్టాలను మాకు వివరించేవారు.

– ఉప్పాల రవీంద్రబాబు, కైకలూరు

గడపగడపకు సంక్షేమం



జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా



పోలవరం రూరల్: మండలంలోని కుంకాలలో ఇంటింటికి వెళ్ల సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

అగ్గిపుల్లలపై అమర వీరులకు నివాళి



అగ్గిపుల్లలపై అమర వీరుల ప్రతిబింబాలు చెక్కి నివాళులర్పించిన మైక్రో ఆర్టిస్ట్



మేతర సురేష్ బాబు, మైక్రో ఆర్టిస్ట్

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర దినోత్సవ వేళ నాటి స్వాతంత్య్ర సమరంలో పాల్గొన్న అమర వీరులకు ప్రతిబింబాలను అగ్గిపుల్లలపై చెక్కి ఏలూరుకు చెందిన మేతర సురేష్ బాబు ఘన నివాళులర్పించారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అగ్గిపుల్లలపై నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత సింగ్ ప్రతిబింబాలను చెక్కారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు, కళాభిమానులు సురేష్ బాబును అభినందించారు.

ఎస్ఈబీ హెడ్ కానిస్టేబుల్ బదిలీ

ద్వారకాతిరుమల: భీమడోలు ఎస్ఈబీ హెడ్‌కానిస్టేబుల్ పి.కృష్ణారెడ్డిని మాతృ స్టేషన్ జంగారెడ్డిగూడెంకు బదిలీ చేస్తూ ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు హెడ్ కానిస్టేబుల్ డబ్బులు డిమాండ్ చేస్తూ, తమను వేధిస్తున్నాడంటూ దొరసానిపాడు గ్రామానికి చెందిన మట్టా శ్రీను, మరికొందరు అతడితో ఆదివారం ఘర్షణకు దిగిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై స్పందించిన ఎస్ఈబీ అడిషినల్ ఎస్పీ.. హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డిపై చర్యలు చేపట్టారు. గతంలో జంగారెడ్డిగూడెం నుంచి భీమడోలు ఎస్ఈబీకి ఇచ్చిన అటాచ్‌మెంట్ ఆర్డర్‌ను రద్దు చేశారు.

శ్రీవారి భక్తులకు డ్రెస్ కోడ్ ఇక్కట్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం ఆలయంలోకి వెళ్లే భక్తులకు డ్రెస్ కోడ్ ఇక్కట్లు తప్పడం లేదు. ముందస్తు ప్రకటన లేకుండా ఆలయంలో డ్రెస్‌కోడ్‌ను అమలు చేయడాన్ని పలువురు భక్తులు తప్పుబడుతున్నారు. ద్వారకాతిరుమలలో శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో భక్తులు సంఖ్య ఎక్కువగా ఉంటుంది. స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొనే భక్తులకు మాత్రమే ఇప్పటి వరకు డ్రెస్‌కోడ్ అమలులో ఉంది. అయితే సంప్రదాయ దుస్తులు ధరించిన భక్తులకు మాత్రమే ఆలయ ప్రవేశమంటూ గత నాలుగు రోజులుగా సెక్యూరిటీ సిబ్బంది భక్తులకు హుకుం జారీ చేస్తున్నారు. ఫ్యాంట్, షర్ట్, లేదా పంచి, షర్ట్, కండువా ధరించిన పురుషులను, అలాగే పంజాబీ, చుడీదార్ డ్రెస్‌లు, చీరలు ధరించిన యువతులు, మహిళా భక్తులను మాత్రమే ఆలయంలోకి అనుమతిస్తున్నారు. డ్రెస్‌లపై చున్నీలు లేని యువతులు, మహిళలను సెక్యూరిటీ సిబ్బంది ఆలయంలోకి వెళ్లనివ్వడం లేదు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో భక్తులు అప్పటికప్పుడు వస్త్ర దుకాణాల వద్దకు పరుగులు తీసి, కండువాలు కొనుక్కొని, వాటిని కప్పుకుని ఆలయంలోకి వెళుతున్నారు. ముందస్తు ప్రకటన, సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇలా డ్రెస్‌కోడ్ అమలు చేయడం ఏంటని పలువురు భక్తులు మండిపడుతున్నారు. దీనిపై ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావును వివరణ కోరగా స్వామివారి నిత్యకల్యాణంలో మాత్రమే డ్రెస్ కోడ్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఆలయంలోకి వెళ్లే భక్తులకు ఎలాంటి డ్రెస్‌కోడ్ నిబంధనలు పెట్టలేదన్నారు. సెక్యూరిటీ సిబ్బంది భక్తులను ఎందుకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారనే దానిపై విచారణ చేస్తామని తెలిపారు.

నిషేధిత గ్లైసిల్ మందు విక్రయంపై కేసు



గొల్లపల్లిలో విక్రయిస్తున్న గ్లైసిల్ మందును స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో ఉన్న శ్రీకృష్ణసాయి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ మందును విక్రయిస్తుండటంతో 39 లీటర్ల గ్లైసిల్ మందు డబ్బాలను విజిలెన్స్ సీఐ యూజే విల్సన్ స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు రిపోర్టు అందిస్తామని, అనుమతి లేని మందును విక్రయిస్తున్న దుకాణంపై కేసు నమోదు చేయాలని సూచించారు.

ఫెన్సింగ్ చాంపియన్‌గా పశ్చిమ

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్–20 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను పశ్చిమగోదావరి జిల్లా గెలుచుకుందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సత్యనారాయణరాజు తెలిపారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల విజేతలకు అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు చేతుల మీదుగా సోమవారం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడిస్తూ.. ఫాయిల్ బాలికల విభాగంలో ప్రకాశం జిల్లాకు చెందిన తనుజ ప్రథమ స్థానంలో నిలవగా ద్వితీయ, తృతీయ స్థానాలను కె.ప్రణీత, పుష్పాంజలి(గుంటూరు) గెల్చుకున్నారన్నారు. ఫాయిల్ బాలికల విభాగంలో పీటీవైబీ సాయిరాజ్(వెస్ట్ గోదావరి) ప్రథమ స్థానంలో నిలవగా.. హెచ్ సువర్ణరాజు ద్వితీయ, ఏఎల్ వెంకటేష్ తృతీయ (గుంటూరు)స్థానాల్లో నిలిచారు. ఎప్పే బాలికల విభాగంలో పీకే నమ్రత (ప్రకాశం) ప్రథమ, ఎల్ శ్రీజ (పశ్చిమ గోదావరి) ద్వితీయ, ఎం.ధనుష్యసాయి(విజయనగరం) తృతీయ స్థానం దక్కించుకున్నారు. బాలుర విభాగంలో మష్లజ్ (అనంతపురం) ప్రథమ, అనీష్ వర్మ(పశ్చిమ) ద్వితీయ, ఎస్ మురళీకృష్ణ (శ్రీకాకుళం) తృతీయ స్థానం దక్కించుకున్నారు.